క్లుప్తంగా

మినీ గోశాలల పరిశీలన మినీ



దుగ్గేరులో మినీ గోశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: మండలంలో పనసభద్ర, దుగ్గేరు గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మినీ గోశాలల నిర్మాణాలను ఎంపీడీవో స్వరూపారాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఎనిమిది గ్రామాలలో తొలి విడతగా గోశాలలు మంజూరయ్యాయని తెలిపారు. ఆయా గ్రామాలలో పనులు జరుగుతున్నందున, పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన పనులు జరిపించేందుకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం బాగుజోల గ్రామంలో జీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరమ్మ, టెక్నికల్ సహాయకులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన చెరువు గట్టు



ఊర చెరువు గట్టుపై ఉన్న అక్రమ నిర్మాణాలు

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లి గ్రామంలో గల చెరువు వీధిలో ఉన్న ఊర చెరువు ఆక్రమణకు గురైంది. ఈ చెరువు కింద సుమారు 250 ఎకరాలకు ఆయకట్టు ఉంది. చెరువు గట్టుపై స్థానికులు పశువుల శాలలు, ఇంటి నిర్మాణాలను చేపట్టి చెరువు గట్టును ఆక్రమించారు. దీంతో రైతులు పంట పొలాలకు రాకపోకలు చేసేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే చెరువు ఆక్రమణకు గురికావడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ పూర్తిస్థాయిలో చర్యలు లేకపోవడంతో స్థానికులు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆశాజనకంగా అపరాల పంటలు



ములగలో ఆశాజనకంగా మినప చేను


పార్వతీపురం: మండలంలోని అపరాల పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వరికోతలు కోసేందుకు ముందు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులు అపరాలు వేసేందుకు ఆసక్తి కనబర్చారు. ఇందులో భాగంగా సుమారు 2,200 ఎకరాల్లో మినుము, పెసలు, ఉలవలు వంటి పంటలు వేశారు. ప్రస్తుతం మండలంలోని ములగ, ఎంఆర్ నగరం, గోపాలపురం, చినబొండపల్లి, సంగంవలస, గంగాపురం, కవిటిభద్ర, తాళ్లబురిడి, పెదబొండపల్లి, చినబొండపల్లి, బందలుప్పి, జమదాల, నర్సిపురం తదితర గ్రామాల్లో అపరాల పంటలు రైతుకు సంతోషాన్నిచ్చే విధంగా కన్పిస్తున్నాయి. కాగా అల్పపీడనం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరికలు జారీచేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా ఏపీ సీడ్స్‌కు ధాన్యం తరలింపు



ఏపీ సీడ్స్ వద్ద అన్‌లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న ధాన్యం

సాలూరు రూరల్: మండలంలోని సీడ్ ధాన్యాన్ని రైతులు ఏపీ సీడ్స్ కార్యాలయానికి ముమ్మరంగా తరలిస్తున్నారు. సాలూరు మండలంలో వివిధ రకాల వరి విత్తనాలు 1600 ఎకరాల విస్తీర్ణంలో అధికారులు పంపిణీ చేసారు. అయితే ప్రస్తుతం 1000 ఎకరాల వరకు కోతలు నూర్పులు జరిగినట్లు అంచనా. మంగళవారం ఒకేసారి ఏపీ సీడ్స్ కార్యాలయానికి అధిక సంఖ్యలో రైతులు ధాన్యాన్ని తరలించడంతో కలాసీలు తక్కువ మంది ఉండడంతో వచ్చిన ధాన్యాన్ని పూర్తిగా అన్‌లోడ్ చేయలేకపోయారు. దీంతో 10 లోడ్లు వరకు ఆరుబయట ట్రాక్టర్లతో ఉండిపోయాయి. అయితే తుఫాన్ హెచ్చరికలు జారీచేయడంతో రైతులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ కోతలు కోసి పొలాల్లోనే కొంతవరకు చేలు ఉండిపోయాయి. అలాగే నూర్పులు చేసి బస్తాలకు నింపి కళ్లాల్లో కొంతమంది రైతుల ధాన్యం ఉన్నాయి. తుఫాన్ ప్రభావం ఏమేరకు చూపిస్తుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బస్తాలకు ఎత్తి కళ్లాల్లో ఉన్న సీడ్ ధాన్యం

సామాన్యుడిపై ధరల దరువు



- ఎన్నికల ముందు హామీలను మరిచిన కూటమి ప్రభుత్వం
- సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల బాదుడు
- నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి
- నూతన మద్యం పాలసీపేరుతో భారం
- పంట బీమా ప్రీమియం చెల్లింపు బాధ్యత రైతులదే

పార్వతీపురంటౌన్:

గడిచిన ఆరునెలలుగా సామాన్యుల జీవనం భారంగా మారింది. నిత్యావసర సరుకుల ధరలు, పెరిగిన విద్యుత్ చార్జీలు, వంటనూనె, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వచ్చే ఆదాయం కంటే ఖర్చులు అధికమయ్యాయి. ప్రభుత్వ పథకాల ద్వారా లభిస్తున్న ఆర్థిక భరోసా నిలిచిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని ధరలు పెరిగిపోయాయి. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు విలవిలలాడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కంటే మిన్నగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, అధికారంలోకి వస్తే అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల వారిపై ఆర్థికభారం వేస్తూ సామాన్యుడిపై ధరల భారాన్ని మోపుతున్నారు. సామాన్యుడు వినియోగించే నిత్యావసర వస్తువుల నుంచి విద్యుత్ చార్జీల వరకు ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించాల్సింది పోయి తిరిగి ప్రజల నుంచి ధరల రూపంలో ప్రభుత్వం అధిక మొత్తంలో సొమ్ముచేసుకుంటోంది. ఆరునెలల పాలనలో ధరల పెంపుపై ప్రజల్లో, ప్రజా సంఘాల్లో ఆందోళన నెలకొంది. నిత్యావసర సరుకులు, సర్దుబాటు పేరుతో విద్యుత్‌చార్జీలు, అన్నదాతలు వినియోగించే ఎరువులు, నూతన మద్యం పాలసీ పేరుతో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి ప్రజలకు ఎమ్మార్పీ కన్నా అధికంగా అందజేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్నివర్గాల వారిపై కూటమి ప్రభుత్వం సామాన్యులపై ధరల ధరువును మోగిస్తున్నారు.

కనుమరుగైన ప్రభుత్వ తోడ్పాటు..

గత ప్రభుత్వం సామాన్యులకు అండగా నిలిచింది. క్రమం తప్పకుండా ఆర్థిక తోడ్పాటునిచ్చేది. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు చేర్చేది. తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు అదుపుతప్పినా సామాన్యుల జీవనం ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. జూన్‌నెలలో అమ్మ ఒడి పథకం, వైఎస్సార్ లా నేస్తం(మొదటి విడత), జూలైలో జగనన్న విదేశీ విద్యాదీవెన(మొదటి విడత, వైఎస్సార్ నేతన్న నేస్తం, ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలు, జగనన్న తోడు(మొదటి విడత), వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ), వైఎస్సార్ కల్యాణ మస్తు-షాదీ తోఫా(రెండో త్రైమాసికం), ఆగస్టులో జగనన్న విద్యాదీవెన(రెండోవిడత), వైఎస్సార్ కాపునేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర, సెప్టెంబర్‌లో వైఎస్సార్ చేయూత లభించేది. ఆయా పథకాల ద్వారా లక్షల మందికి నేరుగా లబ్ధి చేకూరేది. చంద్రబాబు ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించడంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యుల జీవనం భారంగా మారిందని విశ్లేషకులు వివరిస్తున్నారు.



రైతు బజార్‌లో ఉల్లిపాయలు కొనుగోలు చేస్తున్న పట్టణ వాసులు

● విద్యుత్ వినియోగదారులకు షాక్

విద్యుత్ చార్జీలు పెంచబోమని ట్రూఅప్ చార్జీలు కూడా నిలిపివేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి తాను ఏ హామీ ఇవ్వలేదంటూ కూటమి ప్రభుత్వం బుకాయించింది. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. ఇంధన సర్దుబాటు, చార్జీల పేరిట గత నెలలో వినియోగదారులపై బారాన్ని మోపి ఇప్పుడు ఈనెల నుండే మరో బాదుడుకు సిద్ధమైంది. యూనిట్‌పై గరిష్ఠంగా రూ.2.50పైసలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో 4.6లక్షల మంది వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నారు. చార్జీలు తగ్గించాలని ప్రజలు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది.

అందనంత ఎత్తులో నిత్యావసర వస్తువుల ధరలు

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. పేద, మధ్యతరగతి వారి జీవనశైలి భారంగా మారింది. ఏం తిందామన్న ధరలు పెరగడంతో తినలేని పరిస్థితి నెలకొంది. కూరగాయలు, వంటనూనె, తదితర వస్తువుల ధరలు అందుబాటులో లేకుండా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నిత్యావసర ధరలపై కనీసం పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో మార్కెట్లలో దళారులదే రాజ్యమైంది. పండిస్తున్న రైతుకు గిట్టుబాటు ధరలు లేకపోగా రిటైల్ వ్యాపారులు భారీగా ఆర్జిస్తున్నారు.

పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు(రూ.లలో)

కందిపప్పు	180
వంటనూనె	140
వెల్లుల్లి	340
ఉల్లి	55
బంగాళదుంపలు	40

● రైతన్నలపై ఆర్థిక భారం

కూటమి ప్రభుత్వం రైతన్నల పాలిట శాపంగా దాపురించింది. రబీసీజన్‌లో ఎరువుల ధరలను పెంచి రైతన్నల వెన్ను విరుస్తోంది. గతప్రభుత్వం హయాంలో రైతులకు సమృద్ధిగా ఎరువులను అందించేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం చేస్తూ వచ్చేది. రైతులకు రవాణాభారం లేకుండా నేరుగా గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా సరఫరా చేసేది. మరోవైపు డీసీఎంఎస్ ద్వారా విక్రయాలు చేసింది. ఫలితంగా ఎక్కడా ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయే అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలు, సొసైటీల ద్వారా ఎరువుల సరఫరా నిలిపివేసింది. దీంతో వ్యాపారులు కొరత సృష్టించి ధరలు పెంచి-రైతన్నలను దోచుకుంటున్నారు.

'పెరిగిన ధరలతో ఇబ్బందులు



నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికంగా భరోసా ఇచ్చేది. గత ప్రభుత్వానికంటే మిన్నగా సంక్షేమ పథకాలు అందజేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్యుడిపై ఆర్థిక భారం మోపుతోంది.

– ఎం.సత్యం నాయుడు, వినియోగదారుడు, బాలగుడబ గ్రామం

ఎరువుల ధరలు తగ్గించాలి



ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలు తగ్గించి రైతులపై భారం తొలగించాలి. ఎన్నికల ముందు రైతులను ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు ధరలు పెంచడం న్యాయం కాదు. రైతులు పంట వేయడం మానివేస్తే ఆహారం సంక్షోభం వస్తుంది. పెరిగిన ధరలను తగ్గించి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలి.

– జి. సింహాచలం నాయుడు, రైతు, దళాయిపేట గ్రామం

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు



సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే వెనక్కు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వరుసగా రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి తక్షణమే విద్యుత్ చార్జీలు తగ్గించాలి. ప్రజలపై భారాన్ని మోపితే రానున్న రోజుల్లో భారీ ఉద్యమం చేపడతాం.

– గొర్లి వెంకటరమణ, సీఐటీయూ, జిల్లా నాయకుడు

మరమ్మతుల్లో నర్సిపురం వాటర్‌స్కీమ్

- 6 గ్రామాలకు అందని తాగునీరు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదిపై ఉన్న నర్సిపురం మంచినీటి పథకం విద్యుత్ మోటార్లు పని చేయకపోవడంతో రెండు రోజులుగా ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. నిర్దేశించిన గ్రామాలకు తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ హనుమంతరావు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న మంచినీటి సంప్‌ను, నదిలోఉన్న ఇన్‌వెల్ ట్యాంక్‌కు అమర్చిన మోటారును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సిపురం మంచినీటి పథకం ద్వారా మరిపివలస, సూరంపేట, గుచ్చిమి, చిన్నారాయుడుపేట, సీతారాంపురం, జోగింపేట, అప్పయ్యపేట, పెదభోగిలి కాలనీలకు తాగునీరు సరఫరా అవుతోందన్నారు. సంప్‌నుంచి నదిలో ఉన్న వాటర్‌కు అమర్చిన విద్యుత్ మోటారుకు సంబంధించిన వైరు పని చేయడం లేదని, ఇప్పుడా వైరు మూడోలైన్ రైల్వే ట్రాక్‌లోపల అమర్చడంతో ఇప్పటివరకూ ఉన్న వైరు పని చేయడం లేదని తెలియజేశారు. కొత్తగా వైరును ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సంప్‌నుంచి నదిలో ఉన్న వాటర్ ట్యాంక్ వరకూ అమర్చి తాగునీరు సరఫరా రెండు రోజుల్లో పునరుద్ధరించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పవన్‌కుమార్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించాలి

- వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి జగన్‌మోహన్‌రావు



జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: అనారోగ్య సమస్యలు ముందస్తుగా గుర్తించే లక్ష్యంతో ఆరోగ్య సర్వేలు పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని బాలగుడబ, కృష్ణపల్లి గ్రామాల్లో హెల్త్-వెల్‌నెస్, అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్సీడీ, స్కూల్‌హెల్త్, అంగన్వాడీ హెల్త్ స్క్రీనింగ్, సర్వేలు ఏమేరకు చేపడుతున్నారో రికార్డులు, ఆన్‌లైన్‌లో నమోదు తీరు పరిశీలించారు. 18 ఏళ్లు పైబడిన వారికి నిర్వహిస్తున్న ఎన్సీడీ సర్వే ద్వారా కొత్తగా దీర్ఘకాలిక రోగ లక్షణాలు, అలాగే క్షయ, లెప్రసీ ఇతర ఆరోగ్య సమస్యల సర్వే వివరాలపై ఆరా తీశారు. క్యాన్సర్ ముందస్తుగా గుర్తించడం ఆవశ్యకమని నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్స్ ఎంతమందికి చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ద్వారా విద్యార్థుల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు గుర్తించారా అని రికార్డులు పరిశీలించారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో ప్రతిరోజూ ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారో ఓపీ రికార్డుల్లో పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఇ-సంజీవని కాల్స్ వివరాలను ఇంటర్‌నెట్‌లో పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు, మందుల లభ్యత, కాలపరిమితి తనిఖీ చేశారు. కేంద్రం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయం డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, వైద్యసిబ్బంది జగన్నాథరావు, శిరీష, రామలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది జయలక్ష్మి, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులు, ఏఎస్ఎంలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు 2025-26 మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ, పి. త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రామాలలో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు నిర్వహించాలని చెప్పారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరం ఎంతైనా ఉందన్నారు, పంచాయతీల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారంతో, వివిధ శాఖల సిబ్బంది అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఓటీలు బి. మనోహర్, ఎ.శశిభూషణరావు, పీటర్ పాల్, కె శ్రీనివాసరావు వివిధ గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాధికారి ఎం.శశికుమార్

పార్వతీపురంటౌన్: జిల్లాలో జరుగుతున్న ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్రవాహన దారులకు హెల్మెట్ వాడకంపై రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ మైనార్టీ తీరకుండానే తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారని, వారు హెల్మెట్ పెట్టుకోకుండా బైక్‌లు స్పీడ్‌గా నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు, వెనుక కూర్చున్న వారు ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. మద్యం తాగి వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలను తెలియజేశారు. వాహనాలపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, పాటించని వారు ట్రాఫిక్ రూల్స్ ప్రకారం భారీగా అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అపరాధ రుసుముతో పాటు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రజా రవాణాధికారి, జి.సత్యనారాయణ, ఎన్.రమేష్ కుమార్, ఎ.వరప్రసాద్, బి.కాశీరామ్ నాయక్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

మక్కువ: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం,గురువారం మండలస్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక -2024-25లో భాగంగా స్థిరకరణ అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి మంగళవారం తెలిపారు. ఈనెల 7వ తేదీన విజయనగరంలోని డీపీఆర్‌సీలో శిక్షణ పొందిన మండల స్థాయి అధికారులు స్థిరీకరణ అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణ థీమ్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతోనే భూముల సమస్య పరిష్కారం

సీతానగరం: మండలంలోని రైతుల 'భూ' సమస్యల పరిష్కారం రెవెన్యూ సదస్సులతో సాధ్యమని తహసీల్దార్ వి.ఉమామహేశ్వరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కె.వెంకటాపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంబంధిత అంశంపై సదస్సులో దరఖాస్తులు ఇవ్వాలని వీలైతే స్థానికంగా వాటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. అలాగే క్రయ విక్రయాలు జరిగితే వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను పొందుపరచాలని సూచించారు. తక్షణమే మ్యుటేషన్స్ పెట్టనున్నామని, వంశపారం పర్యంగా వస్తున్న భూములకు సంబంధించిన సమస్యలు, కుటుంబ సభ్యుల నుంచి పూచీకత్తులు తీసుకుని నిబంధనలకు లోబడి అసలైన రైతుల పేరున రికార్డుల్లో పొందుపర్చడానికి వీలుందన్నారు. భూమి క్రయ విక్రయాలు ఒకరి పేరు మీద ఒకరు మార్పించేందుకు భూ రిజిస్ట్రేషన్లు ఉంటే సమస్యలను దరఖాస్తు రూపంలో తెలియజేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓతో పాటు గ్రామ పెద్దలు బి.గోపాలకృష్ణ, బి.గవురునాయుడు, బి.ముకుంద రావు, బి.మోహన్‌రావు పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వి. ఉమామహేశ్వరరావు

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


- డీఈఓ తిరుపతి నాయుడు



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఎస్.తిరుపతినాయుడు

బలిజిపేట: పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంచి ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎస్.తిరుపతినాయుడు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వంతరాం ఉన్నత పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఉదయం ప్రార్థన సమయానికి పాఠశాలకు హాజరయ్యారు. విద్యార్థుల క్రమశిక్షణపై సంతృప్తి చెందారు. పదవ తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సయోధ్యగా ఉండి వారికి సహకరించాలని చెప్పారు. పాఠశాల పరిసరాలను చూసి సంతృప్తి వెలిబుచ్చారు. మధ్యాహ్నభోజన పథకం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ, సహఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకులతో కళకళ లాడుతున్న జలపాతాలు



ఉల్లాసంగా జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు



జలపాతం వద్ద వంటలు చేస్తున్న మహిళలు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం,శిఖపరువు,కురుకుట్టి జలపాతాలు పర్యాటకుల సందడితో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శిఖపరువు జలపాతం వద్ద పర్యాటకులు వంటవార్పు చేసుకుని మరీ ఆనందంగా గడిపారు. డిసెంబర్ నెల ప్రారంభం నుంచి సాలూరు మండలంలోని ఏజెన్సీ ప్రాంతలో గల జలపాతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. దూర ప్రాంతాల నుంచి యువతతో పాటు కుటుంబ సమేతంగా గ్రూపులుగా జలపాతాల వద్దకు చేరుకుని ఆనందంగా గడుపుతున్నారు. కొంతమంది అక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేసి రాళ్లమధ్య పారే నీటిలో స్నానాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. అయితే జలపాతాల వద్ద గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు పర్యాటకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, పారే నీటిలో దిగేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

- సుభద్రలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు



సుభద్రలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

బలిజిపేట: త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథముల ప్రచార కార్యక్రమాన్ని ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక బొబ్బిలి కమిటీ సభ్యులు బలిజిపేట మండలంలో మంగళవారం నిర్వహించారు. ధనుర్మాసం, మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని మండలంలో సుభద్ర, బర్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరేందుకు సులభంగా దారి ఏర్పడుతుందనేందుకు గుర్తుగా ఉంది కనుక మార్గశిరమాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలని సూచించారు. దైవభక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంలో ఉండాలని ప్రబోధించారు. ధనుర్మాసంలో గురువును శరణు వేడి తాను శూన్యంగా మిగిలిపోతే ఉత్తరాయణంలో మోక్షం చేరగలరని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో బొబ్బిలి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సీహెచ్ అప్పలనాయుడు, ఎం.వెంకట్రావు, జి.గోపాలకృష్ణ, సీహెచ్ నాగలక్ష్మి, కల్యాణి, మేఘన తదితరులు పాల్గొన్నారు.